# "బాలానాం రోదనం బలం"

కొన్ని వేల సంవత్సరాల క్రిందట భారతదేశంలో ఒక గొప్ప వీరుడు ఉండేవాడు. అతని పేరు విశ్వజిత్తు. ప్రపంచాన్నంతటినీ అతడు జయించాడు. అతడు ఎంతటి బలవంతుడు అంటే ఒక వెయ్యి సింహాలు, ఒక వెయ్యి ఏనుగులు ఎదుర్కొన్నా సరే, అన్నిటినీ ఓడించగలవాడు. రాక్షసులను, దేవతలను, మనుష్యులను అందరినీ ఓడించి విశ్వజిత్తు అనే బిరుదు పొందాడు. భూమి, వాయువు మొదలైన పంచభూతాలను, కామ క్రోధాది అరిషడ్వర్గాన్ని జయించాడు. అతడు జయించనిది, అతనికి లోబడనిది ఇక ఏదీ లేదు. పరమసంతుష్టితో, ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకుంటూ విశాల సామ్రాజ్యాన్ని పాలిస్తున్నాడు.

ఒకరోజున అతనివద్దకు నలుగురు మనుషులు వచ్చారు. "ఏం కావాలి మీ"కని విశ్వజిత్తు అడిగాడు.

"నేను బీదవాణ్ణి. నాకు చాలమంది పిల్లలున్నారు. కుటుంబాన్ని పోషించలేకపోతున్నాను," అని ఒకడు అన్నాడు.

"నాకు సిరి సంపద లున్నాయి గాని సంఘంలో గౌరవం లేదు," అన్నాడు రెండోవాడు.

"నాకు సిరిసంపదలు, సంఘ గౌరవం ఉన్నాయి గాని క్రోధం చాలా ఎక్కువ. క్రోధం వచ్చినప్పుడు నన్ను నేను అదుపులో పెట్టుకోలేక పోతున్నాను. దీనివల్ల నాకు మనశ్శాంతి లభించకుండా ఉన్నది," అన్నాడు మూడోవాడు.

"నాకు ఏ కొఱతా లేదు గాని నేను పొట్టివాణ్ణి. అందరూ నన్ను పొట్టివాడని చులకనచేస్తున్నారు," అని నాలుగోవాడు అన్నాడు.

విశ్వజిత్తు వారి కోరికలను సావధానంగా విన్నాడు. 'అతడు పరమ దయాళువు. ఎవ రేది అడిగినా లేదనకుండా ఇచ్చే స్వభావం గలవాడు.

వారికి ఒక్కొక్కరికీ ఒక్కొక్క చిన్న భరిణె ఇచ్చాడు. అందులో ఉన్న మందు ఇంటికి వెళ్లిన తరువాత వంటికి రాసుకోమని సలహా ఇచ్చాడు.

మొదటి ముగ్గురూ అలా నే చేశారు. ఇంటికి వెళ్ళి మందు వంటికి రాసుకున్నారు. మొదటివాడు కొద్దిరోజుల్లో అదృష్టం కలిసివచ్చి గొప్పభాగ్యవంతుడయ్యాడు. రెండోవాడు సంఘపూజితుడయ్యాడు. మూడోవాడు క్రోధాన్ని అణచుకొని శాంత స్వభావుడయ్యాడు.

నాలుగోవాడు భరిణె పుచ్చుకుని ఇంటికి వెడుతూ ఒక అడవి దారిలో ఆగి, ఆత్రుత పట్టలేక మందు తీసి రాసుకున్నాడు. అంతే. అతడిక ఎవరికీ కనిపించక అతడు నుంచున్నచోట ఒక ఎత్తయిన వృక్షం మొలిచింది. ఆ అడవిలోకల్లా ఎత్తయిన చెట్టుగా అది పెరిగింది. విశ్వజిత్తు సలహాకు విరుద్ధంగా చేసినందున అతని కా ప్రతిఫలం లభించింది.

ఈవిధంగా అతని కీర్తి దశదిశలా వ్యాపించింది. ఒక రోజున అతనివద్దకొక స్త్రీ వచ్చింది. "ఏం కావా"లని విశ్వజిత్తు అడిగాడు.

"మహాప్రభూ! మీరు ప్రపంచాన్నంతటినీ జయించారని అందరూ భావిస్తున్నారు. కాని మీరు జయించనివాడొకడున్నాడు," అన్నది ఆమె.

విశ్వజిత్తు ఆశ్చర్యపడ్డాడు. "ఎవడు వాడు? ఎక్కడ ఉంటాడు? ఎలా ఉంటాడు?" అని ప్రశ్నపరంపర కురిపించాడు.

"నేను చెబితే మీరు నమ్మరు. మీరే స్వయంగా చూద్దురు గాని నా వెంట రండి. అతన్ని ఏ మానవుడూ జయించలేడు," అన్నది ఆ స్త్రీ.

విశ్వజిత్తుకు ఆమె మాటలతో కొంచెం కోపం కలిగింది. కాని అంతకంటె ఎక్కువగా ఆశ్చర్యం కలిగింది. ఇన్నేళ్ళ రాజ్యపాలనలో తన నీవిధంగా ఎవరూ అన సాహసించలేదు. ఇప్పుడొక సామాన్య

# ★ "బాలానాం రోదనం బలం" ★

స్త్రీ వచ్చి ఇలా ఈసడిస్తున్నది. తనకు లొంగని ఆ బలవంతుడెవడు. ఇంతకాలం అటువంటి వాడొకడు ఉన్నాడనైనా తాను వినలేదే?

తన ప్రత్యర్థి ఎంత ఎత్తున, ఎంతలావున ఉంటాడో, రాక్షసుడో దేవతయో చూడాలనే ఆసక్తితో ఖడ్గ, కవచ, శిరస్త్రాణధారియై విశ్వజిత్తు ఆ స్త్రీ వెంట వెళ్ళాడు. ఆమె అతన్ని తన ఇంటికి తీసుకుపోయింది. నట్టింట్లో ఆటవస్తువులతో ఆడుకొంటున్న అందమైన తన పుత్రుణ్ణి చూపించింది. "వీడే" అని మహారాజుతో అన్నది.

విశ్వజిత్తు ఫకాలున నవ్వాడు. "వీడా నా ప్రత్యర్థి!" అన్నాడు.

"ఇలా రా అబ్బాయ్" అని బాలుణ్ణి పిలిచాడు.

బాలుడు బొటనవేలు నోట్లో పెట్టుకుని చీకుతూ "నీ లెక్కేమిటి పోవోయ్" అన్నట్టు చూశాడు.

విశ్వజిత్తు ఆశ్చర్యపడ్డాడు, తను ఆజ్ఞాపించడం, ఒక బాలుడు నిరసించడమూ అని. ఇంకా కొంచెం గట్టిగా రమ్మని పిలిచాడు. బాలుడు పక్కన ఉన్న గరిటె తీసుకుని విసిరేశాడు. అది సరాసరి వచ్చి విశ్వజిత్తు ముఖానికి కొట్టుకుంది.

విశ్వజిత్తు మహోగ్రుడైపోయాడు. ఎన్నడూ కోపంరాని అతనికి పట్టరాని ఆవేశం వచ్చింది. "ఎవరనుకుంటున్నావురా నన్ను?" అని భూమండలమంతా అదిరిపోయేటట్లు, వెయ్యి పిడుగు లొక్కసారి పడినట్లు అరిచాడు. ఆ అరుపుతో బాలుడు హడలిపోయి బావురుమని ఏడుపు లంకించుకున్నాడు. ఇల్లెగిరిపోయేటట్లు, ఇల్లేమిటి ఆకాశమే ఎగిరిపోయేటట్లు ఏడవసాగాడు. విశ్వజిత్తు కోపపడినకొద్దీ ఇంకా ఎక్కువగా ఏడుస్తున్నాడు. దగ్గిరికి రమ్మంటే రాడు. పోనీ ఎత్తుకుని ఊరుకోరా అంటే ఊరుకోడు. గిలగిల తన్నుకోవడం, గింజుకోవడం, రక్కడం, బరకడం సాగించాడు. వాడి ఏడుపు కర్ణకఠోరంగా, సీనా రేకులు బర్రున నేలమీద గీచినట్లు గుండెలను ఝల్లు మనిపిస్తున్నది. విశ్వజిత్తు ఎంత ప్రయత్నించినా ఆ బాలుడి ఏడ్పు మాన్పలేకపోయాడు. ఇక అక్కడ నిలవలేక "నీకూ, నీ ముద్దుల కొడుక్కూ వెయ్యి దండాలు" అని పారిపోయి వచ్చేశాడు.

చూశారా? విశ్వాన్ని అంతటినీ జయించిన విశ్వజిత్తు ఒక ఏడాది పాపడి చేతుల్లో ఓడిపోయాడు! అందుకే లోకాన్ని గెలువవచ్చుగాని పిల్లలతో దెబ్బలాడి గెలువలేము. విశ్వజిత్తువంటి వాడే ఈ విషయంలో ఓడిపోతే మనం ఒక లెక్కా? ★

చైనీస్ కథలు - పెంగ్ స్వే ఫెంగ్:

# 3. న్యాయం కోసమే కళ

మృత్యుదేవత మందిరంవంటి పుట్టలోనుండి భయంకరమైన కృష్ణసర్పం బయటికి వచ్చి పడగఎత్తి చూచింది. పుట్టదిగువ అమాయికంగా ఆహారం ఏరుకుంటున్న క్రౌంచపక్షి కనబడింది. సర్పం జర్రున ప్రాకిపోయి దాన్ని కాటువేసి చంపింది.

చెట్టుమీద పిల్లలకు ఆహారం పెడుతున్న పెంటిపిట్ట భర్త ఆకస్మిక మరణానికి అమితంగా దుఃఖింప సాగింది. హృదయవిదారకంగా విలపించింది. అలా చాలసేపు ఏడ్చి ఏడ్చి తన భర్తను చంపిన దుష్ట సర్పంపై క్రోధంతో ఆక్రోశించింది. పెంటిపక్షి దుఃఖాక్రోశంతో అరణ్యమంతా ప్రతిధ్వనించింది. మనోహరమైన వసంత ఋతువులో కలకలలాడవలసిన అరణ్యం ఈ విషాదసంఘటనతో ఆత్మీయులు చనిపోయిన గృహంలాగా నిశ్శబ్దంతో బరువెక్కింది.

ఆ దారినపోతున్న ఒక గాయకుడు క్రౌంచపక్షి ఆక్రోశం విన్నాడు. అతని హృదయం కరుణతో ఆర్ద్రమైంది. "నా హృదయం ఎందుకిలా వేదన పొందుతున్నది? ఈ వేదనను గానంగా మార్చగలిగితే ఎంత బాగుంటుంది?" అనుకున్నాడు.

వేణువుతీసి తనలోకలిగిన మానవవేదనను గానంగాఆలపించసాగాడు. దుస్సహమైన దుఃఖంతో, తీవ్రమైన ప్రతీకారభావంతో అతని వేణుగానం వాడవాడలా ధ్వనించింది. చలి వణకించే ప్రాతఃకాలానగాని, నిశ్శబ్దపురాత్రులగాని, పనులతొందరలో మునిగిన పగటివేళగాని ఎప్పుడు, ఎవరు ఆ పాట విన్నా దుఃఖంతో, కోపంతో ఊగిపోయేవారు; సజ్జనులకు హానిచేసే కృష్ణసర్పాన్ని వెదకడానికి బయలుదేరేవారు; సర్పం కనిపిస్తే చాలు, కొట్టి చంపివేసేవారు. అందుకే క్రౌంచపక్షిని చంపినది ఆయినా